Home About us Contact us Archives Home For Deepawali Special

## పుస్తక సమీక్ష



# తెలుగు కథ హద్దులు చెరిపిన డయాస్పోరా

## సూటిగా సాగుతూ నిద్ర మత్తు ఒదిలించే కథలు

సమీక్ష: సి.యస్.ఆర్.

ఒక్కోసారి చదివిన కథల్నే మళ్లీ చదివినప్పుడు ఇంకా బావున్నట్టని పిస్తాయి. కొన్ని కథలు చదవగానే ఎంత కలవరపెడతాయంటే మిగిలిన కథల్ని వెంటనే చదవటానికి మనసొప్పుకోదు. ఈ రెండు తరహా కథలను చక్కటి వస్తు శిల్పాలతో చెక్కిన శిల్ప చాతుర్యం కథా శిల్పి సాయి బ్రహ్మానందం గొర్తిలో చూస్తాం. అమెరికాలో స్థిరపడిపోయి ప్రతిభావంతంగా రాస్తున్న బహుకొద్దిమంది రచయితల్లో ఒకరాయన. అమెరికాలో వున్న తెలుగువారి జీవితాల్లోని ఒక కొత్త సంస్కృతిని పరిచయం చేస్తాయి ఆయన కథలు. 'సరిహద్దు'గా వెలువడిన ఆయన కథా సంకలనంలో ఇరవై ఐదు కథలున్నాయి. అందులో పదకొండు కథలు అమెరికా జీవితాన్ని చిత్రికపడితే మూడు, నాలుగు కథలు అమెరికా నేపథ్యంగా సాగుతాయి. అన్ని కథలు వైవిధ్యభరితంగా వున్నాయి. దాదాపు కథలన్నీ స్త్రీల జీవితాలు, వారి సమస్యల చుట్టూ పరిభ్రమిస్తాయి. సంపుటిలోని మొదటి కథ "అతను" పాఠకుల్ని షాక్‌కి గురిచేసే కథ. మంచితనం ముసుగులో ప్రతి మగవాడూ ఆడదాన్ని శాసించే వాడే అంటారు రచయిత. డాక్టర్ కోర్సు చదివిన ఉత్పల తన కోర్సు నిరుపయోగంగా మారిందని భావించి ఇంట్లో వాళ్లకి చెప్పకుండా ఇండియాకి తిరిగి వచ్చేస్తుంటే తోటి ప్రయాణీకుడు వర్మతో తన వ్యధను చెప్పుకుంటుంది. తన భర్త గురించి చేసిన వ్యాఖ్యను ప్రస్తావిస్తూ ఉత్పల చెప్పిన మాటలు మగవాళ్లందరికీ చెంపఛెళ్లుమనేలా తగులుతాయి. 'అతను నిజంగా మంచివాడే.. కానీ మగాడు మీ అందరిలాటి వాడు'. ఈ సంపుటి అంతట్లోకి విశిష్ట మయిన కథ 'సరిహద్దు'. ఈ కథ తర్వాతి కథలోకి వెంటనే వెళ్ల నివ్వదు. మనల్ని వెంటాడే కథ. అమెరికా లాంటి దేశం కూడా బాత్రూంలు కడగటం, టాయిలెట్లను శుభ్రపరచటం వంటి గుర్తింపులేని కష్టంతో కూడుకున్న పనులు చేసేవారి కోసం మెక్సికో వంటి దేశాల నుంచి జరిగే ఇల్లీగల్ వలసలను ఎలా చూసీ చూడనట్లు ఉంటుందో కళ్లకు కట్టించే కథ. అయితే దీనికో అందమయిన ప్రేమ కథను జత చేశారు రచయిత. అరిజోనా ప్రాంతపు ఎడారి నుంచి వలస వచ్చే మెక్సికన్ల దుర్భర స్థితిని మన చేత అనుభూతిస్తారు రచయిత. ప్రేయసిని వెతుక్కుంటూ వచ్చిన హేవియర్ అనే మెక్సికన్ కుర్రాడు అమెరికన్ జైల్లో బందీ అయిపోయి తన విషాద గాథను ఒక ఇండియన్‌కు ఉత్తరం రాయటంతో కథ మొదలవుతుంది. "ఈ అమెరికా అన్నది ఒక మాయాజాలం. వయసులో వున్న కుర్రవాడు అందమైన అమ్మాయి మోహంలో పడ్డట్టు అందరూ ఈ దేవుడి మాయలో పడిపోతారు. గ్రీన్ కార్డు వచ్చేవరకూ మీకూ స్వేచ్ఛ లేదు". మనసును తొలిచేసే వాక్యాలు ఇలాంటివి ఎన్నింటినో రచయిత గుల్‌మొహర్ పువ్వుల్లాగా మనమీద రాలుస్తారు. రాజ్యాలు పోయినా, రాచరికాలు రద్దయినా, ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది అన్నా వలస జీవితాలెప్పుడూ సంకెలలమయమే కదా అని ఓ నిట్టూర్పు అప్రయత్నంగా వెలువడుతుంది.

> రచయితగా తన మనోధర్మాన్ని ఎరుక పరచటంలో కృతకృత్యులయ్యారు గొర్తి. ఈ కథలింత బాగుండటానికి కారణం రచయితకున్న ప్రత్యేక శైలితో పాటు చిన్నచిన్న వాక్యాలతో పెద్దపెద్ద జీవిత సత్యాలను సున్నితంగా చెప్పే పద్ధతి.

స్త్రీ స్వేచ్ఛపట్ల, మగవాడి దౌష్ట్యం పట్ల రచయితకు కొన్ని ఖచ్చితమయిన అభిప్రాయాలున్నాయి. అవకాశమొస్తే ఆడవాళ్లని లొంగదీసుకునే ప్రయత్నం చేయకుండా వుండరని 'మరో అహల్య కథ'లో ఆయన చెప్పిన తీరు మనల్ని దిగ్భ్రాంతి పరుస్తుంది. ఇంకో సందర్భంలో పిల్లల పెంపకానికి స్త్రీ స్వేచ్ఛ ప్రతిబంధకం కాకూడదంటారు. ఈ అభిప్రాయాన్ని రెండు కథల్లో విశదపరుస్తారు. 'స్వేచ్ఛ' కథలో పిల్లాడి పెంపకం కన్నా డ్రీమ్ యూనివర్సిటీలో ఎం.బి.ఏ. ముఖ్యం కాదని ఓ తల్లి కూతురికి ఉత్తరం రాస్తూ కూతురికోసం తను వైణికురాలిగా గుర్తింపు కోల్పోవలసి వచ్చినా గృహిణిగా గెల్చానని గీతోపదేశం చేస్తుంది. ఇంకో కథ 'సర్దుబాటు'లో స్వేచ్ఛపేరుతో తన తల్లి తండ్రిని అనవసరంగా దూరం చేసుకున్నదని భావించిన సరూ అనే ఓ అమ్మాయి ఇద్దరు మనుషులు కలిసి జీవించడానికి కాస్తయినా రాజీ పడకపోతే ఎలా అని ప్రశ్నిస్తుంది. దీని కొనసాగింపుగా అన్నట్లు అబద్ధాలతో భార్యాభర్తలు కాస్తయినా జీవితాన్ని హాయిగా గడుపుతున్నారంటారు. 'అబద్ధాల నిజం'లో అన్నీ సీరియస్ కథలే కాదు. కొన్ని సరదా కథలూ వున్నాయి. తెలుగు వారి జీవితాన్ని ఎక్కడున్నా ఆక్రమించే సినీమాయ మీద రెండు సెటైర్ కథలున్నాయి. అమెరికాలోని తెలుగు అసోసియేషన్లకు తమ వార్షికోత్సవాలకు సినిమా వాళ్లను ఒక వెర్రిలా ఆహ్వానించే అలవాటుంది కాబట్టి అలా వచ్చిన నటీనటులకు ఆతిథ్యమిచ్చి భంగపడిన ఓ వెంకీ వ్యథ 'అతిథి వ్యయో భవ'.

జీవితంలో ఎదురయ్యే అనేక సంఘటనలకు జీవం పోసి, పాత్రలను సృష్టించి వాటిని మన అంతర్లోకాలకు తోడ్కొనిపోయి రచయితగా తన మనోధర్మాన్ని ఎరుక పరచటంలో కృతకృత్యులయ్యారు గొర్తి. ఈ కథలింత బాగుండటానికి కారణం రచయితకున్న ప్రత్యేక శైలితో పాటు చిన్నచిన్న వాక్యాలతో పెద్దపెద్ద జీవిత సత్యాలను సున్నితంగా చెప్పే పద్ధతి. కొన్ని మచ్చుతునకలు పాఠకుల కోసం "డబ్బు సౌకర్యాలనిస్తుంది. కానీ సుఖానివ్వదు" (అతను) "ప్రతిఫలాలు కోరే బంధాల్లో ప్రేముండదు. వ్యాపారముంటుంది" (వానప్రస్థం), మనం నిదానంగా ఆలోచిస్తే భూతాల్లాంటి సమస్యలు కూడా మన ముందు చీమల్లాగా కనిపిస్తాయి" (స్వేచ్ఛ), తెలుగుకథను ఖండాంతరాలలో వ్యాపింపచేస్తూ తనదైన గొంతుతో విస్పష్టంగా చెప్పే 'గొర్తి'లోని 'ఆర్తి' పాఠకులను కదిలిస్తుంది. స్పష్టంగా, సూటిగా సాగుతూ నిదుర మత్తుని వదిలించే కథలివి. నాలుగైదు కథలలో చిన్నచిన్న ముద్రా రాక్షసాలున్నాయి. వాటిని సవరించితే బావుండేది.

తెలుగు కథలోని 'డయాస్పోరా' (Diaspora) గాలుల్ని ఆస్వాదించాలంటే చక్కటి ముఖ చిత్రంతో ఆకట్టుకుని ఈ కథలను చదవాల్సిందే!




**సరిహద్దు**
సాయిబ్రహ్మానందం గొర్తి
పేజీలు: 200
ధర: 100 రూపాయలు
ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయా బుక్‌హౌస్, దిశ పుస్తక కేంద్రం, తెలుగుబుక్‌షాప్ బ్రాంచీలలో, ప్రభవ నెల్లూరులో లభ్యం.



PREVIOUS PAGE NEXT PAGE

Copyright 2010-2011 @ Navyaweekly.com, All rights Reserved. This site Best viewed in 1024X768